II

నమస్తే తెలంగాణ

తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | మంగళవారం 14 నవంబర్ 2023 www.ntnews.com

■ మీకు తెలుసా?

## వెలుగు జిలుగుల తెలంగాణ

| స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఇదీ.. | | విద్యుత్ వినియోగం ఇలా.. | |
|---|---|---|---|
| 2014లో | ఇప్పుడు | 2014- 15లో | 2022-23లో |
| 7,778 మెగావాట్లు | 19,464 మెగావాట్లు | 39,183 మిలియన్ యూనిట్లు | 66,661 మిలియన్ యూనిట్లు |



■ యార్కర్



### ఎర్రిపప్పలు కాదు.. కొండెర్రి పప్పలు!!

ఏమైందిరా సంతుగా నీలో
నువ్వే నవ్వుకుంటున్నవ్

ఏం లేదురా ఉల్లాసంగా.. ఉత్సాహంగా
సినిమాల హీరో గ్యాంగ్
హీరోయిన్ లెగ్ ఎక్స్‌రే చూసి ఇచ్చిన
బిల్డప్ గుర్తొచ్చిందిరా
గీ కాంగ్రెసోళ్లు
మొన్న కాళేశ్వరం బరాజ్ కాడ
చేసిన హంగామా చూస్తుంటే!!

లెగ్ ఎక్స్‌రే చూస్తూ చిన్న మెదడు చితికి
కిందికి కారిపోతుందంటూ ఆ గ్యాంగ్
చెప్పినట్టే బరాజ్ ఎక్స్‌టెన్షన్ జాయింట్‌ను
చూసి రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ
క్రాక్ క్రాక్ అని ట్విట్టర్ల పోస్టు పెట్టిన్రు
ఎర్రిపప్పలు

ఓ గదానికే గింత నవ్వుతున్నవా?
నిన్న ఓ ఇన్‌స్టాగ్రం రీల్స్ ఫేమస్
కాంగ్రెస్ లీడర్
ఏమన్నడో ఎర్కేనా?
కర్మగాలి వాళ్లు అధికారంలోకి వస్తే
ఇప్పుడు కేసీఆర్ 24 గంటలు కరెంట్
ఇస్తున్నట్టే
తాము రోజుకు 48 గంటల కరెంటు
ఇస్తమని అన్నడు..
ఆ మాటలు ఇన్నంక అక్కడున్న జనాలు
నవ్వుకుంట రెండు జేబులల్ల చేతులు
పెట్టుకొని
నడుసుకుంటా పోయిన్రు తెలుసా?

అరేయ్ రాజు కొంపదీసి
రోజుకు 48 గంటలు చేస్తం అని
ఏడో గ్యారెంటీ కూడా ఇయ్యరు గదా?

గీ కాంగ్రెస్‌ల ఎర్రిపప్పలే అనుకున్నా
అంతకు మించి కొండెర్రిపప్పలు గూడ
ఉన్నర్రా
అని మా సంతుగాడు కడుపుపట్టుకొని
నవ్వుకుంట
ఇంటి మొఖాన పోయిండు

పోంగ పోంగ ఆడు ఓ మంచి ముచ్చట
చెప్పిండు
గీ జోకర్‌గాళ్లకు ఓటేస్తే మన బతుకు
నవ్వులపాలైతది..
వందేండ్ల ముందుచూపునోళ్లకేస్తే మన
బతుకు పూలపాన్పు అయితది

-రాజు అతికం




### ఇండిపెండెంట్ల హ్యాట్రిక్

ఒక పార్టీ అభ్యర్థి హ్యాట్రిక్ సృష్టించడం సాధారణ విషయమే. కానీ, నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలో ఇండిపెండెంట్లు హ్యాట్రిక్ సృష్టించారు. 1957 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి శ్రీనివాసరావు విజయం సాధించారు. తర్వాత 1962 రాంగోపాల్‌రెడ్డి, 1967లో ఆర్‌బీ రావు గెలుపొందారు. ఈ ముగ్గురూ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఒకే అభ్యర్థి (కేవీ రెడ్డి)పై విజయాన్ని ముద్దాడడం మరో విశేషం. ఒకేస్థానం నుంచి వరుసగా మూడుసార్లు వేర్వేరు అభ్యర్థులు స్వతంత్రులుగా గెలవడం అరుదు. అయితే, 1967 తర్వాత బోధన్‌లో ఇండిపెండెంట్లు ఎప్పుడూ విజయ తీరాలను చేరలేదు.

#### అప్పట్లో స్వతంత్రులదే హవా

ఈ మధ్యకాలంలో స్వతంత్ర అభ్యర్థులు గెలవడం తగ్గిపోయింది కానీ ఎన్నికల ప్రక్రియ మొదలైన కొత్తలో స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగానే గెలిచేవారు. 1952లో అప్పటి హైదరాబాద్ రాష్ట్రానికి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 14 మంది స్వతంత్రులు విజయం సాధించారు. ఆ తర్వాత 1957లో జరిగిన ఎన్నికల్లో తెలంగాణ నుంచి 12 మంది స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. 1962 ఎన్నికల్లో 19 మంది స్వతంత్రులు విజయం సాధించారు. 1967 ఎన్నికల్లో ఏకంగా తెలంగాణ నుంచి 26 మంది అభ్యర్థులు స్వతంత్రులుగా గెలుపొందారు. ఆ తర్వాత క్రమంగా స్వతంత్ర ఎమ్మెల్యేల సంఖ్య తగ్గుతూ వస్తున్నది.



# కేసీఆర్ విజన్.. కేటీఆర్ మిషన్

## హైదరాబాద్.. నయా ఐటీ హబ్

- ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ అద్భుత ప్రగతి
- నగరానికి క్యూ కట్టిన వందలాది కంపెనీలు
- కేసీఆర్ ప్రభుత్వ కృషితో ఈ రంగానికి ఊతం
- పదేండ్లలో నాలుగు రెట్లు పెరిగిన ఎగుమతులు
- దేశంలో కొత్త ఐటీ ఉద్యోగాల్లో 33 శాతం మనవే

బిగ్ స్టోరీ



**ఐటీ రంగంలో** తెలంగాణ కొత్త చరిత్రను లిఖిస్తున్నది. అంతర్జాతీయ కంపెనీలకు కేరాఫ్‌గా మారి.. భారతదేశానికి కొత్త ఐటీ హబ్‌గా అవతరించింది. ఐటీ రంగం పదేండ్లలోనే అసాధారణ ప్రగతిని సాధించి ఔరా అనిపించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మిషన్‌తో వేలాది కంపెనీలు మన తెలంగాణ బాట పట్టాయి. లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. చదువు పూర్తి చేసుకొని పట్టా అందుకున్న పట్టభద్రులకు నేడు తెలంగాణే గమ్యస్థానం. యువత భవిష్యత్తుకు ఇవాళ హైదరాబాదే గ్యారెంటీ. పదేండ్లలోనే రాష్ట్రంలో ఐటీ రంగ ఎగుమతులు నాలుగు రెట్లు, ఈ రంగంలోని ఉద్యోగాల సంఖ్య మూడు రెట్లు పెరగడమే రాష్ట్రం సాధించిన ప్రగతికి తార్కాణం.

... శేఖర్ బరిగెల

> హైదరాబాద్ నుంచి ఐటీ ఎగుమతులను రెట్టింపు చేస్తాం... మన నగరాన్ని ఐటీ హబ్‌గా మారుస్తాం.
>
> తెలంగాణ సొంత రాష్ట్రంగా అవతరించిన కొత్తలో ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చెప్పిన మాట ఇది.

ఈ మాట ఇప్పుడు అక్షర సత్యం అయ్యింది. రెట్టింపు కాదు ఏకంగా నాలుగు రెట్లు ఐటీ ఎగుమతులు పెరిగాయి. పదేండ్లలో ప్రపంచమే ఆశ్చర్యపోయేలా ఈ రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతిని సాధించింది. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు విజయవంతం అయ్యాయి. కొత్త ఐటీ పాలసీని రూపొందించి పెట్టుబడులను ఆకర్షించడంలో సర్కార్ సక్సెస్ అయ్యింది. కొత్త కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు మంత్రి కేటీఆర్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి. ఈ ప్రయత్నాల ఫలితమే.. గత పదేండ్లలో రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు రెట్టింపయ్యాయి. రాష్ట్రంలో ఈ రంగంలోని ఉద్యోగాలు మూడు రెట్లు పెరిగాయి.



### ఐటీఐఆర్ ఇవ్వకపోయినా అభివృద్ధి ఆగలేదు..

తెలంగాణకు రావాల్సిన ఐటీఐఆర్ ప్రాజెక్టును కేంద్రం ఇవ్వకపోయినా ఐటీ రంగంలో దేశంలోనే తెలంగాణ అత్యుత్తమ ప్రదర్శనను కనబరుస్తున్నది. ఇందుకు నిదర్శనం రాష్ట్రం నుంచి గత పదేండ్లలో జరిగిన ఐటీ ఎగుమతులే. ఐటీఐఆర్ ప్రాజెక్టు వస్తే 2035 నాటికి రూ.2.5 లక్షల కోట్ల ఎగుమతులు వస్తాయని అంచనా వేశారు. కానీ కేంద్రం ఐటీఐఆర్‌ను పూర్తిగా రద్దు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఈ రంగానికి సంబంధించి ఎన్నో పాలసీలు, ప్రోత్సాహకాలను తీసుకువచ్చింది. ఫలితంగా పదేండ్లలోనే రూ.57 వేల కోట్ల నుంచి రూ.2.41 లక్షల కోట్ల ఎగుమతులకు చేరుకున్నాం.

### టెక్నాలజీ రంగంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన పాలసీలు

1. తెలంగాణ ఐసీటీ పాలసీ: 2016
2. ఎలక్ట్రానిక్స్ పాలసీ : 2016
3. ఇన్నోవేషన్ పాలసీ: 2016
4. డేటా సెంటర్స్ పాలసీ: 2016 (దేశంలోనే మొదటిది)
5. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పాలసీ: 2017
6. బ్లాక్ చెయిన్ పాలసీ: 2019 (దేశంలోనే మొదటిది)
7. డ్రోన్ పాలసీ: 2019(దేశంలోనే మొదటిది)

### ఆకాశమే హద్దుగా ఐటీ అభివృద్ధి

తెలంగాణ ఏర్పడకముందు ఉమ్మడి ఏపీగా ఉన్నప్పుడు 2013-14లో ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్లుగా ఉంటే 2022-2023లో రూ.2,41,275 కోట్లకు చేరాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఈ రంగంపై చూపిన ప్రత్యేక చొరవతో ముఖచిత్రమే మారిపోయింది. ప్రతియేటా ఆకాశమే హద్దుగా ఐటీ ఎగుమతులు, ఉద్యోగాల్లో తెలంగాణ వృద్ధి సాధిస్తున్నది. కరోనా సృష్టించిన సంక్షోభ సమయంలోనూ తెలంగాణలో ఐటీ పరుగులు ఆగలేదు. గతంలో దేశంలో ఐటీ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న బెంగళూరు పేరు వినిపించేది. ఇప్పుడు దేశంలో ఐటీకి కేరాఫ్ హైదరాబాద్. వీటి కార్యకలాపాల కోసం వినియోగించే ఏ గ్రేడ్ ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో హైదరాబాద్ నగరం బెంగళూరును మించిపోవడమే ఇందుకు ఉదాహరణ. రాష్ట్రంలో ఈ రంగ అభివృద్ధికి ఉన్న అనుకూలతలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న విధివిధానాల వల్లే ఐటీ రంగంలో ఇంత తక్కువ కాలంలో ఎక్కువ ప్రగతి సాధ్యమయ్యిందని నిపుణులు అంటున్నారు.



### ఐటీ ఎగుమతులు ఇలా...

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత

| వార్షిక సంవత్సరం | ఎగుమతులు (రూ.కోట్లలో) | వార్షిక వృద్ధి రేటు (శాతాల్లో) |
|---|---|---|
| 2014-15 | 66,276 | 16 |
| 2015-16 | 75,070 | 13 |
| 2016-17 | 85,470 | 14 |
| 2017-18 | 93,442 | 9 |
| 2018-19 | 1,09,219 | 17 |
| 2019-20 | 1,28,807 | 18 |
| 2020-21 | 1,45,522 | 12.98 |
| 2021-22 | 1,83,569 | 26.14 |
| 2022-23 | 2,41,275 | 31.44 |

తెలంగాణ రాక ముందు
2013-14
57,258

### పాలసీల రూపకల్పనలో రోల్ మాడల్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదేండ్లకు ఒకసారి ఐటీ పాలసీని కొత్తగా రూపొందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 2016, 2021లో పాలసీలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నది. వీటికి తోడు ఐటీ శాఖ పరిధిలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్‌ను ఏర్పాటు చేసి 10 టెక్నాలజీలను ప్రభుత్వ కార్యకలాపాలకు సమర్థవంతంగా వినియోగిస్తున్నది. టెక్నాలజీ రంగంలో వస్తున్న కొత్త మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకునేందుకు మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఐటీ శాఖ ముందుచూపుతో వ్యవహరిస్తున్నది. ఈ మేరకు కొత్త పాలసీలను రూపొందిస్తూ ఆయా రంగాల్లోని సంస్థలను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నది.

### ఐటీ అభివృద్ధితో ఇతర రంగాల్లోనూ జోష్

ఐటీ రంగం అభివృద్ధి చెందితే పరోక్షంగా ఇతర రంగాలు వృద్ధి చెందుతాయి. ఈ రంగంలో ఉద్యోగాలు పెరిగితే అనేక రంగాల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఒక ఐటీ ఉద్యోగానికి పరోక్షంగా 4 ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఐటీ వృద్ధి కారణంగా ముఖ్యంగా రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, వినోదం, రవాణా, లాజిస్టిక్స్ రంగాలు వృద్ధి చెందుతాయి. ఈ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో జరుగుతున్నది ఇదే.

### దేశ ఐటీ వృద్ధి కంటే మూడు రెట్లు అధికం

ఐటీ రంగంలో దేశం మొత్తం సాధిస్తున్న వృద్ధి కంటే తెలంగాణ దాదాపు మూడు రెట్లు ఎక్కువ వృద్ధి సాధిస్తున్నది. 2022 - 23 వార్షిక సంవత్సరంలో దేశంలో ఐటీ ఎగుమతుల వృద్ధి రేటు 9.36 శాతం ఉంటే తెలంగాణ వృద్ధి 31.44 శాతం ఉంది. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో స్థానం పొందిన పదుల సంఖ్యలో బహుళ జాతీయ సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్నాయి. హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం అవలంబిస్తున్న విధివిధానాలను వివరించి ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు మంత్రి కేటీఆర్ తీసుకుంటున్న చొరవ కారణంగా అనేక విదేశీ కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నాయి.

### శిక్షణకు కేరాఫ్‌గా హైదరాబాద్

ఉద్యోగాల కల్పనలో మాత్రమే కాదు ఉద్యోగాల కోసం శిక్షణ పొందేందుకు కూడా హైదరాబాద్ కేరాఫ్‌గా మారింది. ఒకప్పుడు ఐటీ శిక్షణ కోసం బెంగళూరుకు వెళ్లేవారు. ఇప్పుడు హైదరాబాద్‌కు వస్తున్నారు. ఇక్కడే వేలాది కంపెనీలు, లక్షలాది ఉద్యోగ అవకాశాలు ఉండటంతో ఇక్కడే శిక్షణ తీసుకొని ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇందు కోసం నగరంలో పెద్ద ఎత్తున శిక్షణ సంస్థలు ఏర్పాటయ్యాయి. కళాశాలల్లోనూ ఉద్యోగ నైపుణ్యాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో విద్యార్థులు చదువు పూర్తి చేసుకోగానే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ల్లోనే మంచి ఉద్యోగాలు పొందుతున్నారు.

### ప్రపంచమంతా లే ఆఫ్‌లు.. తెలంగాణలో ఆఫర్ లెటర్లు

కొత్త ఐటీ ఉద్యోగాల సృష్టిలోనూ తెలంగాణ జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నది. తెలంగాణ రాకముందు 2013-14లో 3.23 లక్షల ఐటీ ఉద్యోగులు ఉంటే.. 2022-23 నాటికి తెలంగాణలో 9.05 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారు. ఈ రంగంలో గత పదేండ్లలో దేశం మొత్తం మీద 21 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తే కేవలం తెలంగాణ నుంచే 5.8 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చాయి. అంటే, దేశం మొత్తంలో వచ్చిన కొత్త ఉద్యోగాల్లో తెలంగాణ వాటా ఏకంగా 27.6 శాతం. 2023లో ప్రపంచం మొత్తం లే ఆఫ్‌లతో ఉద్యోగాలు పోతున్నా తెలంగాణలో మాత్రం ఐటీ ఉద్యోగాల సంఖ్య 1.27 లక్షలు పెరిగాయి. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 16.29 శాతం ఎక్కువ.

### ప్రతి మూడు కొత్త ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణ నుంచే

ఐటీ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నాస్కామ్ నివేదిక ప్రకారం.. గత ఏడాది దేశంలో 4.5 లక్షల మందికి ఐటీ ఉద్యోగాలు రాగా అందులో 1.5 లక్షల మంది హైదరాబాద్ నుంచే ఉన్నారు. అంటే, దేశంలో వస్తున్న ప్రతి మూడు కొత్త ఐటీ ఉద్యోగాల్లో ఒకటి హైదరాబాద్‌లోనే వస్తున్నది. ఈ విషయంలో బెంగళూరు కూడా హైదరాబాద్ తర్వాతనే నిలిచింది. కొత్త ఉద్యోగాల కల్పనలో మన తెలంగాణ రోల్ మాడల్‌గా నిలుస్తున్నది. అందుకే, ప్రతి యేటా లక్షలాది మంది యువత చదువులు పూర్తి కాగానే హైదరాబాద్ బాట పడుతున్నారు.

### నైపుణ్యాలు పెంచడమే టాస్క్

ఐటీతో పాటు ఇతర రంగాల్లో యువతకు అవసరమైన నైపుణ్యాలు కల్పించడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టాస్క్ ద్వారా ఇప్పటివరకు 7 లక్షల మందికి పైగా యువతీయువకులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించింది. ఈ రంగంతో పాటు ఐటీఈఎస్, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, వంటి అనేక రంగాల్లోనూ టాస్క్ శిక్షణ ఇస్తున్నది. టాస్క్‌లో శిక్షణ పొందిన వేలాది మంది యువతీ యువకులకు మంచి వేతనాలతో ఉద్యోగాలు లభించాయి.



### తెలంగాణ ఐటీ రంగంలోని ఉద్యోగాలు

కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత

| వార్షిక సంవత్సరం | ఉద్యోగాలు |
|---|---|
| 2014-15 | 3,71,774 |
| 2015-16 | 4,07,385 |
| 2016-17 | 4,31,891 |
| 2017-18 | 4,75,308 |
| 2018-19 | 5,43,033 |
| 2019-20 | 5,82,126 |
| 2020-21 | 6,28,615 |
| 2021-22 | 7,78,121 |
| 2022-23 | 9,05,715 |

కేసీఆర్ ప్రభుత్వం రాకముందు
2013-14
3,23,396





### టాప్ కంపెనీలకు కేరాఫ్

బహుళ జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు మంత్రి కేటీఆర్ తీసుకుంటున్న చొరవ ఫలిస్తున్నది. ప్రతి నెలా ఏదో ఒక కంపెనీ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతున్నట్టు ప్రకటిస్తున్నది. ప్రస్తుతం గూగుల్, ఆపిల్, ఫేస్‌బుక్, అమెజాన్, ఓలా, వన్‌ప్లస్, ఒప్పో, మైక్రాన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ ప్రధాన వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించాయి. ఇంకా అనేక కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఐటీ రంగాన్ని విస్తరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఈ ప్రయత్నాల ఫలితంగానే నేడు వరంగల్, నిజామాబాద్ వంటి నగరాల్లోనూ ఐటీ కంపెనీలు ఏర్పాటవుతున్నాయి.